


# కృష్ణార్జున సంవాదం - 6

## భక్తి భావన పై సరికొత్త దృక్కోణం



"నాతో సహా మనలో చాలామంది మన పురాణాల్ని తప్పుగా అర్థం చేసుకున్నారని ఇప్పుడు నాకర్థమైంది. ఐతే ఇలా ఎందుకు జరిగిందంటావు?" అడిగాడు అర్జునరావు.

"ఈ మాత్రం దానికి అన్నయ్యనడగాలా? ముందు పురాణాల్ని మీరెందుకు తప్పుగా అర్థం చేసుకున్నారో చెప్పండి" అంది సుభద్ర.

కృష్ణారావు నవ్వి, "బాగా అడిగావు కానీ ఆలోచించుకునేందుకు బావకు కొంచెం టైమివ్వాలి కదా! ఈలోగా నేను నిన్నో ప్రశ్న వేస్తాను. వెంటనే జవాబు చెప్పాలి" అన్నాడు.

"ఆయన నిన్నో ప్రశ్న వేస్తే దాన్ని ఆయనకే తిప్పికొట్టాను. అలా నీకు సాయపడ్డందుకు థాంక్సు చెబుతావనుకుంటే - నువ్వేమో నీ ప్రశ్నల తుపాకీని నాకే గురిపెట్టావు. చాలా బాగుంది. పుణ్యానికిపోతే పాపమెదురైందన్నట్టైంది" అంది సుభద్ర నిష్ఠూరంగా.

"చూసావా - సరిగ్గా నేననుకున్న పాయింటుకే వచ్చావు. నీలోనే కాదు, మన వాళ్ళందరిలోనూ ఇదే లోపం. ఆధునిక యుగంలో కృతయుగం నాటి ఆచారాలు పాటిస్తారు. వాటి ప్రాధాన్యం తెలియనివారు అదేమని ఎక్కదీస్తే ఆ ప్రశ్నను గురిపెట్టిన తుపాకీలా ఫీలౌతారు. మన పురాణాల విషయంలోనూ ఇదే జరిగింది. ఎవరికైనా చిన్న అనుమానమొచ్చినా సరే - 'తప్పు, దేవుడి గురించి ప్రశ్నలేయకూడదు' - అంటూ మన పండితులు సామాన్యుల్నీ, పెద్దలు పిన్నల్నీ మందలిస్తారు. దాంతో మనకు శాస్త్రీయదృక్పథం పోయి అన్నింటికీ నమ్మకమే ఆధారమైంది" అన్నాడు కృష్ణారావు కాస్త కటువుగానే.

"అసలు శాస్త్రీయదృక్పథం అంటే ఎవరే ప్రశ్న అడిగినా తీసిపారేయకుండా ఆలోచించి జవాబివ్వడం"

"జవాబు తెలియకపోతే?"

"అన్వేషించాలి"

"అన్వేషణ ఫలించకపోతే?"

"ఫలించేదాకా అన్వేషిస్తూనే ఉండాలి. అన్వేషణ ఫలించేదాకా తాము అనుసరిస్తున్న సంప్రదాయాన్ని సమర్థించరాదు, ప్రచారం చేయరాదు"

సుభద్ర చిరాగ్గా, "నాకు తోచింది నేను చేస్తాను. సమర్థించొద్దూ అంటే సరే. ప్రచారం చేయొద్దూ అంటే సరే. కానీ కారణాలు అన్వేషించమంటే నా వల్ల కాదు" అంది.

"అదే శాస్త్రీయదృక్పథం లేకపోవడమంటే! నువ్వేం చేసినా గుడ్డిగా చెయ్యకూడదు. నువ్వు చేసే పనిపట్ల నీకు సంపూర్ణమైన అవగాహన ఉండాలి"

"పోనీ - నాకు శాస్త్రీయ దృక్పథం లేదనుకో. అందువల్ల నష్టమేమిటి?"

"చాలా ఉంది శాస్త్రీయ దృక్పథం లోపించడం వల్లనే నమ్మకాలు మూఢనమ్మకాలౌతాయి. ఆచారాలు దురాచారాలౌతాయి. అదే జరిగింది మన సంప్రదాయంలో"

"శభాష్ బావా! నీ చెల్లికి బుద్ధొచ్చేలా చెప్పావు. నేను తనని పూజలూ పునస్కారాల గురించి ఏమడిగినా జవాబు చెప్పదు సరికదా - లెంపలు వేసుకోమంటుంది. బుగ్గలు వాచిపోవడం తప్ప ప్రయోజనం లేదని ఊరుకుందామా అంటే - తను చేసే ప్రతి పనిలోనూ నాకు లక్షాతొంభై అనుమానాలు. అడక్కుండా ఉండలేను. లెంపలేసుకుని వేసుకుని చివరకు నాకు దేవుడు మీదే ద్వేషం పుట్టింది" అన్నాడు అర్జునరావు.

"అన్నయ్య చెప్పింది మీకర్థమైనట్లులేదు. వాడు నాక్కాదు - మీకూ బుద్ధి చెబుత! ఎవరికైతే మంచి నమ్మకం మూఢనమ్మకమనిపిస్తుందో, సదాచారం దురాచారమనిపిస్తుందో - వాళ్ళకు శాస్త్రీయ దృక్పథం లోపించినట్లు" అంది సుభద్ర ఉక్రోషంగా.

"బావా! మా ఇద్దర్లో ఎవరు కరెక్టో నువ్వే చెప్పు" అన్నాడు అర్జునరావు.

"మీరిద్దరూ కరక్టే. అలాగే ఇద్దరూ రాంగే" అన్నాడు కృష్ణారావు.

"ఐతే కరెక్టవ్వాలి. లేకుంటే రాంగ్. ఒకే సమయంలో కరెక్టు, రాంగూ ఉంటుందని మా బోటి అజ్ఞానులంటే ఏమో కానీ - శాస్త్రీయ దృక్పథమున్న నువ్వనడం బాగోలేదు"

"బాగుంటుంది. శాస్త్రీయ దృక్పథం దీన్నే పిల్లి దశ' (cat state) అంటుంది తెలుసా?" అంటూ కృష్ణారావు దాని గురించి వివరించాడు.

విశ్వవిఖ్యాత శాస్త్రజ్ఞుడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ద్వారా ప్రాచుర్యం పొందిన క్వాంటమ్ మెకానిక్స్ భౌతిక శాస్త్రంలో సంచలనం సృష్టించిందని అందరికీ తెలుసు. ఐతే ఆయనక్కూడా అసంబద్ధమనిపించిన 'అనిశ్చిత సూత్రం' ఆ తర్వాత క్వాంటమ్ మెకానిక్స్‌లో ప్రాధాన్యమవడం విచిత్రం. ఆ సూత్రం ప్రకారం అణుశకలాల (atomic particles) స్థితిని ఇదమిద్ధమని నిర్ణయించడం కష్టం. అవి ఏ స్థితిలో ఉండే అవకాశముందో మాత్రం సూచించగలం. ఈ విషయంలో ఎర్విన్ ష్రోడింగర్ అనే ఆయన మరికాస్త ముందుకెళ్ళాడు. ఉదాహరణకాయన ఒక పెట్టెలో ఒక పిల్లి, ఒక అణుశకలం కలిపి బంధించబడినట్లు ఊహించాడు. ఆ అణుశకలం నుండీ ధార్మిక కిరణాలు (radioactive rays) విడుదలైతే వాటి ప్రభావానికి పిల్లి చచ్చిపోతుంది. ఐతే 'అనిశ్చిత సూత్రం' ప్రకారం అణుశకలం ధార్మిక కిరణాలను విడుదల చేయొచ్చు, చేయకపోవచ్చు. కాబట్టి పెట్టె తెరిచే సమయానికి పిల్లి బ్రతికుండొచ్చు, చనిపోయుండొచ్చు. రెండూ ఒకే సమయంలో, వినగానే అర్థరహితమనిపించే ఈ ఊహకు 'పిల్లి దశ' అని పేరెట్టి గౌరవించింది ఆధునిక విజ్ఞానం. ఇటీవలే శాస్త్రజ్ఞులు ఒక అరడజను బెరీలియం పరమాణువులను 'పిల్లి దశ'కు పంపి ఈ ఊహను అద్భుతం చేసారు. ఆ పరమాణువులన్నీ ఒకే సమయంలో కుడివైపుకి ఎడమవైపుకి తిరుగుతున్నాయిట.

"వేదాంతంలోనూ అనేక సందర్భాల్లో ఈ పిల్లి దశ ఉంటుంది. దేవుడున్నాడు, లేడు అనేది వాటిలో ముఖ్యమైనది. అందుకే ప్రతి మనిషీ ఒకే సమయంలో ఆస్తికుడు, నాస్తికుడు కాగలరు" అన్నాడు కృష్ణారావు.

"నువ్వు చెప్పిన విజ్ఞాన సూత్రం తమాషాగా ఉంది కానీ - ఇప్పుడు నేనూ, సుభద్రా కూడా ఒకేసారి ఎలా కరెక్టయ్యామో చెబుతావా?" కుతూహలంగా అడిగాడు అర్జునరావు.

"చాలా సింపుల్. నీ గురించి మా సుభద్ర చెప్పింది కరెక్ట్. అంటే ఆమె నిన్ను చాలా కరెక్ట్‌గా అర్థం చేసుకుంది. నువ్వు సుభద్ర గురించి చెప్పిందీ కరెక్టే. అంటే నువ్వూ తనని అంత కరెక్ట్‌గానూ అర్థం చేసుకున్నావు. ఐతే నిన్నర్థం చేసుకున్న సుభద్ర తన్ను తాను అర్థం చేసుకోలేదు. సుభద్ర నర్థం చేసుకున్న నీకూ నీ గురించి తెలియదు. తమ గురించి ఆలోచించకుండా ఇతరుల గురించి ఆలోచించే మనుషులు పిల్లి దశకు ఉదాహరణ. ఆ దశ దాటితే మీకు సందేహాలుండవు, సమాధానాలే ఉంటాయి" అన్నాడు కృష్ణారావు.

"ఇంతకీ నన్నేదో ప్రశ్న అడుగుతానన్నావు?" మాట మార్చింది సుభద్ర.

"గుర్తుంది. ఇది బంగారానికి సంబంధించిన ప్రశ్న. దీనికి నువ్వే జవాబివ్వగలవు. ఇప్పుడు అరాచకం ప్రబలిపోయింది. చిన్నమెత్తు బంగారం కోసం సామాన్యులు నిండు ప్రాణాల్ని తీసేస్తున్నారు దొంగలు. బంగారు వ్యాపారం చేసే వారి ప్రాణాలక్కూడా రక్షణ లేదు. ఒక మూల బంగారం ధర కూడా రోజు రోజుకూ ఆకాశాన్నంటుతోంది. ఐనా కొత్త కొత్త బంగారు నగల దుకాణాలు వస్తూనే ఉన్నాయి. జనం ఎగబడి కొంటూనూ ఉన్నారు. ప్రాణాలు అరచేతిలోకొస్తూంటే అమ్మేవాళ్ళు బంగారం అమ్మడమెందుకూ, కొనేవాళ్ళు బంగారం కొనడమెందుకూ?" అన్నాడు కృష్ణారావు.

ఇది వింటూనే అర్జునరావులో ఉత్సాహమొచ్చింది, "ఈ మాట నేను మీ చెల్లాయికి చాలాసార్లు చెప్పాను. విననుగాక వినదే" అన్నాడు వెంటనే.

సుభద్ర చురుగ్గా భర్తవైపు చూసి, "ఆలోచించకుండా రెచ్చిపోకండి. అన్నయ్య నాకు మాట చెప్పలేదు. ప్రశ్న వేసాడు. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించేవారిలో అసలీ ప్రశ్నే ఉదయించదు. అన్నయ్య నన్నడిగాడంటే తనకు శాస్త్రీయ దృక్పథం లేదని కాదు. మీకు శాస్త్రీయదృక్పథం కలిగించాలని అడిగుంటాడు"అంది. తర్వాత నవ్వుతూ కృష్ణారావు వైపు తిరిగి, "రోజూ పేపర్లో కనబడే వార్తలు చూసి ఓ నిర్ణయానికొచ్చేయడం శాస్త్రీయ దృక్పథం అనిపించుకోదు. దేశం మొత్తం మీద బంగారం కొనేవాళ్ళు కోట్లలో ఉంటారు. అమ్మేవాళ్ళు లక్షల్లో ఉంటారు. వారిలో దోపిడీకీ, ప్రాణప్రమాదానికీ గురైనవారు కొన్ని వందలమంది మాత్రం. లెక్క చూస్తే కొనేవాళ్ళలో లక్షకొక్కరూ, అమ్మేవాళ్ళలో పదివేల కొక్కరూ మించి ప్రమాదానికి గురయ్యే అవకాశం లేదు. ప్రాణాంతకమని తెలిసీ పొగతాగే దురలవాటును వదులుకోలేని వారెందరో ఉన్నారు. బంగారం పట్ల ఆకర్షణ దురలవాటుకూడా కాదు" అంది.

"చాలా బాగా చెప్పావే" అని చెల్లిని మెచ్చుకుని, "బావా! బంగారానికి ప్రపంచమంతటా గొప్ప ఆకర్షణ ఉంది. ఆ ఆకర్షణ రిస్కు తీసుకునేలా చేస్తుంది. ఆ రిస్కు శాతం ఎంత తక్కువో మా సుభద్ర చాలా చక్కగా వివరించింది. మరి దేవుడికున్న ఆకర్షణే ప్రపంచంలోని దైవ భక్తికి కారణం. దానికి ఏ రిస్కూలేదు. అందువల్ల దైవభక్తి మనిషికి బంగారాన్ని మించిన అలంకరణ. ఇక లెక్కచూస్తే దైవ భక్తివల్ల లాభపడిన వారితో పోల్చితే - నష్టపోయినవారి శాతం అత్యల్పం. అందుకే ఆధునిక యుగంలోనూ దైవభక్తి వర్ధిల్లుతోంది. కొందరి అనాచారాలనూ, మూఢత్వాన్నీ, దుశ్చర్యలనూ దైవభక్తితో ముడిపెట్టక - ప్రతి ఒక్కరూ ఆధునిక యుగానికి తగిన శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి. ప్రతిపౌరుడిలోనూ భక్తిభావముంటే - ప్రపంచంలో శాంతి, సౌఖ్యాలకు కొదవ వుండదు. దేవుడు, దైవభక్తి గురించి నాకొచ్చిన ఆలోచనలను ఓ పుస్తకంలో నోట్సుగా రాసుకున్నాను. ఆ నోట్సు జిరాక్సు కాపీ తీయించి ఇస్తాను - మీకుపయోగపడొచ్చు" అన్నాడు కృష్ణారావు.

కృష్ణారావు వీడ్కోలు తీసుకునే మూడ్‌లోకొచ్చాడని గ్రహించిన అర్జునరావు, "కూర్చుని మాట్లాడుతుంటేనే ఎన్నో ఆసక్తికరమైన వాక్యాలు చెప్పావు. ఇక నోట్సు వ్రాస్తే అదింకా గొప్పగా ఉంటుంది. థాంక్స్ బావా! దాన్ని మేమిద్దరం శ్రద్ధగా చదువుతాం. అది మాకు దేవుడి పట్ల అవగాహన పెంచుతుందని నా నమ్మకం" అన్నాడు అర్జురావు.

ఆ తర్వాత కృష్ణారావు తిరిగి తన ఊరెళ్ళిపోయాడు. అతడు అర్జునరావుకిచ్చిన నోట్సులోని ఆసక్తికరమైన విశేషాలను ఒకటొక్కటిగా నెలనెలా తెలుసుకుందాం. ప్రస్తుతానికి సెలవు.